

కన్నౌజ్ రైల్వే స్టేషన్ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు

## కట్టడాల్లో 'కూలిన' బతుకులు

### యూపీ, ఛత్తీస్‌గఢ్‌లో కూలిన రెండు నిర్మాణాలు

**శిథిలాల కింద ఇద్దరు మృతి**

**29 మందికి గాయాలు**

కన్నౌజ్: నిర్మాణంలో ఉన్న కట్టడాలు కూలడం కార్మికుల బతుకులకు శాపంగా మారుతున్నది. ఉత్తర్ ప్రదేశ్‌లోని కన్నౌజ్ రైల్వే స్టేషన్ వద్ద శనివారం నిర్మాణంలో ఉన్న రూఫ్ స్లాబ్ కూలిపోవడంతో పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారిలో 12 మందిని సహాయక సిబ్బంది రక్షించినట్టు అధికారులు తెలిపారు. ఇంకా 23 మంది వరకు శిథిలాల కిందే ఉన్నట్టు వారు చెప్పారు. ఈ ఘటనలో అయిదుగురు గాయపడ్డారు. పోలీసులు, ఎస్డీఆర్‌ఎఫ్ సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. సంఘటన గురించి తెలుసుకున్న రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ వెంటనే ఘటనా స్థలికి చేరుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

ఇదిలా ఉండగా, ఛత్తీస్‌గఢ్‌లోనూ ఇలాంటిదే మరో ఘటన చోటుచేసుకుంది. రాయ్‌పూర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ భవనం సెంట్రింగ్ ఫ్రేమ్‌లు కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందగా, 6 మంది కార్మికులు గాయపడ్డారు. శనివారం మధ్యాహ్నం వీఐపీ రోడ్‌లోని విశాల్ నగర్‌లో కడుతున్న బహుళ అంతస్థుల భవనం వద్ద ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, భవనంలో 7-10 అంతస్థుల పైకప్పుల (స్లాబ్) నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన సెంట్రింగ్ ఫ్రేమ్‌లు, కర్రలు, ఇనుప కడ్డీలు.. ఒక్కసారిగా కుప్పకూలాయి. వీటి కింద చిక్కుకున్న 10 మందికిపైగా కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీళ్లను దగ్గర్లో ఉన్న వివిధ దవాఖానలకు తరలించారు. చికిత్స పొందుతున్నవారిలో ఒక కార్మికుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీస్ అధికారి ఒకరు చెప్పారు.

## 80 మంది టెన్త్ విద్యార్థినుల చొక్కాలు విప్పించిన ప్రిన్సిపల్

- పెన్ డేలో సందేశాలు రాసుకున్నందుకు తీవ్ర ఆగ్రహం
- బ్లేజర్లేసుకొని ఇండ్లకు విద్యార్థినులు..విచారణకు కమిటీ

ధన్‌బాద్: జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో ఓ ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపల్ 'శిక్ష' పేరుతో చేపట్టిన చర్య తీవ్ర విమర్శలకు దారి తీసింది. తమ చొక్కాలపై సందేశాలు రాసుకున్నందుకు 80 మంది పదో తరగతి విద్యార్థినుల చేత ఆయన చొక్కాలు విప్పించి వారిని బ్లేజర్ల(కోటు లాంటిది) తోనే ఇండ్లకు పంపించారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనపై విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో జిల్లా యంత్రాంగం ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. దిగ్వాడీలోని ఓ ప్రముఖ పాఠశాలలో ఈ ఘటన జరిగినట్టు ధన్‌బాద్ డిప్యూటీ కమిషనర్(డీసీ) మాధవీ మిశ్రా తెలిపారు. పదో తరగతి విద్యార్థినులు పరీక్ష రాసిన తర్వాత ఒకరి షర్టుపై మరొకరు సందేశాలు రాసుకుని పెన్ డే జరుపుకున్నారని బాలికల తల్లిదండ్రులు డీసీకి తెలిపారు. ఈ ఘటనపై పాఠశాల ప్రిన్సిపల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు క్షమాపణ చెప్పినప్పటికీ ప్రిన్సిపాల్ ఆగ్రహం చల్లారలేదని.. బాలికల చేత బలవంతంగా షర్టులు విప్పించి అందరినీ బ్లేజర్‌పైనే ఇండ్లకు పంపించారని బాధితుల తల్లిదండ్రులు డీసీకి ఫిర్యాదు చేశారు. తాను విద్యార్థినులతో మాట్లాడానని.. ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు డీసీ చెప్పారు.

# 'ఉపకారానికి' అపకారం

- మూడేండ్లుగా నిలిచిపోయిన ఎన్టీఎస్ఈ ఎగ్జామ్
- స్కాలర్‌షిప్స్ రాకపోవడంతో పేద విద్యార్థుల గోస
- రూ.40 కోట్లు వెచ్చించడానికి కేంద్రం మీనమేషాలు
- 'పరీక్షా పే చర్చా' కోసం మాత్రం రూ.62 కోట్ల ఖర్చు
- పీఆర్ స్టంట్ల కోసం ఎంతైనా ఖర్చు చేస్తారని విమర్శలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): 'పరీక్షా పే చర్చా' అంటూ 'పీఆర్' స్టంట్‌ల కోసం కోట్లకు కోట్లు ఖర్చు చేస్తున్న కేంద్రంలోని ఎన్డీయే సర్కారుకు.. పేద విద్యార్థుల గోడు మాత్రం పట్టట్లేదు. ప్రతిభ గల విద్యార్థులకు ఉపకార వేతనాల ద్వారా ఆర్థిక చేయూతనందించే ఎన్టీఎస్ఈ ఎగ్జామ్ నిర్వహణకు అవసరమైన నిధులను గడిచిన మూడేండ్లుగా విడుదల చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. ఈ మేరకు ఇంగ్లీష్ పత్రిక 'టెలిగ్రాఫ్' ఆర్టీఐ పిటిషన్ ద్వారా సేకరించిన వివరాలను బట్టి అర్థమవుతున్నది.

**కరోనా సాకుతో..**

ప్రతిభ గల పేద విద్యార్థులకు ఉపకార వేతనాలనిచ్చి మరింతగా ప్రోత్సహించే ఉద్దేశంతో 1963లో నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ (ఎన్టీఎస్ఈ)ను ప్రారంభించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన పదోతరగతి, 12వ తరగతి, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు తరగతులను బట్టి నెలకు రూ. 1,250 నుంచి రూ. 37,500 వరకూ ఉపకార వేతనాలను అందిస్తారు. అయితే, కరోనా సంక్షోభాన్ని సాకుగా చూయించిన కేంద్రం 2021లో ఈ పరీక్ష నిర్వహణను నిలిపేసింది. కరోనా సద్దుమణిగిన తర్వాత కూడా పరీక్ష నిర్వహణను పట్టించుకోలేదు. అలా గడిచిన మూడేండ్లుగా ఈ పరీక్ష నిర్వహించకపోవడంతో.. టాలెంట్ ఉన్నప్పటికీ ఎంతోమంది పేద విద్యార్థులు ఉపకార వేతనాలు విడుదల కాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఖర్చులను తగ్గించుకోవడానికే కేంద్రం ఈ టాలెంట్ స్కాలర్‌షిప్‌లను నిలిపేసిందని అధికారిక వర్గాలను ఉటంకిస్తూ టెలిగ్రాఫ్ తెలిపింది.

**పీఆర్ స్టంట్‌లా..**

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ధైర్యాన్ని నూరిపోసే ఉద్దేశంతో ప్రారంభించిన పీఎం 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం ఇప్పుడు ఓ పీఆర్ స్టంట్‌లా మారిందన్న విమర్శలు ఉన్నాయి. కాగా, గడిచిన మూడేండ్లలో 'పరీక్షా పే చర్చా' కార్యక్రమానికి ఎంత ఖర్చు చేశారని కేంద్రాన్ని 'టెలిగ్రాఫ్' ఓ ఆర్టీఐ పిటిషన్ ద్వారా ప్రశ్నించింది. రూ.62 కోట్లు ఖర్చయినట్టు కేంద్రం సమాధానమిచ్చింది. అయితే, ఎన్టీఎస్ఈ పరీక్ష నిర్వహణ, ఉపకార వేతనాలకు మూడేండ్లలో రూ.40 కోట్ల మేర కూడా ఖర్చయ్యేది కాదని టెలిగ్రాఫ్ ఓ కథనంలో వెల్లడించింది. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడానికి రాని డబ్బులు.. పీఆర్ స్టంట్‌లకు మాత్రం వస్తాయంటూ టెలిగ్రాఫ్ ఆ కథనంలో ఘాటుగా స్పందించింది. విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వడాన్ని పక్కన బెట్టి ప్రధాని మోదీ పీఆర్ స్టంట్లపై ఎక్కువగా దృష్టిపెడుతున్నారని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ విమర్శించారు.



యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ వద్ద స్కాలర్‌షిప్, కాలేజీ ఫీజులపై ఆందోళన చేస్తున్న మహారాణి మహిళా ఆర్ట్స్ కాలేజీ విద్యార్థినులు(ఫైల్)

### ఏం లాభం??

'పరీక్షా పే చర్చా' అంటూ ప్రధాని మోదీ తమ ప్రచారానికి ఆ కార్యక్రమాన్ని వాడుకోవడం దురదృష్టకరం. ఇదే సమయంలో టాలెంట్ టెస్టును నిలిపేయడం ఆందోళన కలిగిస్తున్నది. 'ఎగ్జామ్ వారియర్స్' పేరిట విద్యార్థుల కోసం ప్రధాని మోదీ ఓ పుస్తకాన్ని తీసుకొచ్చారు. అందులో ఉన్న విషయాలనే ప్రతీయేటా 'పరీక్షా పే చర్చా'లో చర్చిస్తున్నారు. దీంతో అనవసరపు ఖర్చు తప్ప ఒనగూరే లాభమేంటి?

**-అశోక్ అగర్వాల్, ఆలిండియా పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు**



## నేత్ర పర్వం.. తొలి వార్షికోత్సవం

**అయోధ్య ఆలయంలో ప్రత్యేక పూజలు**

అయోధ్య:అయోధ్య బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ వార్షికోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. యజుర్వేద పారాయణంతో బాలరాముని విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు బాల రాముడికి మహాభిషేకం, సరయు నదీ జలాలతో అభిషేకం చేశారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగే ఉత్సవాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు రామ కథ పారాయణం నిర్వహించనున్నారు.

## కూటమితో ఉద్ధవ్ ఠాక్రే కటీఫ్

**స్థానిక సంస్థల్లో ఒంటరి పోరుకు నిర్ణయం**

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమిలో చిచ్చుపెట్టాయి. అంచనాలకు భిన్నంగా దారుణ పరాభవాన్ని ఎదుర్కొన్న కూటమి విచ్ఛిన్నం దిశగా వెళ్తున్నది. ఇందులో భాగంగా కూటమికి దూరం జరగాలని శివసేన(యూబీటీ) దాదాపుగా నిర్ణయించింది. త్వరలో జరగనున్న ముంబై, థానే, నాగ్‌పూర్ మున్సిపల్, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ శనివారం ప్రకటించారు. పొత్తుల వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలకు అవకాశాలు లభించవని, అందుకే ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

## భారత్‌లో చొరబాటుకు బంగ్లా స్మగ్లర్ల యత్నం

కోల్‌కతా: బెంగాల్‌లోని మాల్దా జిల్లా సరిహద్దులో బంగ్లాదేశ్ చొరబాటుదారులను, స్మగ్లర్లను భారత సైనికులు మన భూ భాగంలోకి రాకుండా అడ్డుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత నవాడ ఔట్‌పోస్ట్ సమీపంలో చొరబాటుకు యత్నిస్తున్న సాయుధులైన 20 మంది కదలికలను బీఎస్‌ఎఫ్ జవాన్లు గుర్తించారు. కొందరు అప్పటికే కంచెను దాటుకుని భారత భూభాగంలోకి వచ్చినట్టు గమనించారు. సైనికుల కళ్లు గప్పేందుకు చొరబాటుదారులు ఎక్కువ కాంతి గల ఫ్లాష్‌లైట్‌ను ఉపయోగించారు. చొరబాటుదారులను చెదరగొట్టేందుకు సైనికులు గాల్లోకి రెండు రౌండ్ల కాల్పులు జరిపారు.

## మోదీ మాటలు నష్ట నివారణ కోసమే

**కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్**



న్యూఢిల్లీ: ప్రధాని మోదీ తాజాగా పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ చెప్పిన మాటలు ఇప్పుడు రాజకీయంగానూ చర్చనీయాంశమయ్యాయి. జెరోడా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ..తానూ మనిషినే, మానవులంతా చేసినట్టుగా, తాను కూడా తప్పులు చేశానని, తానేమీ భగవంతుడ్ని కాదు కదా! అని అన్నారు. ప్రధాని ఇంటర్వ్యూపై శనివారం కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. నష్ట నివారణ చర్యల్లో భాగంగా ప్రధాని మాటలు ఉన్నాయని జైరామ్ రమేశ్ విమర్శించారు. 'ఇదే వ్యక్తి (ప్రధాని మోదీ) 8 నెలల క్రితం తనను తాను దేవుడి ప్రతినిధిగా చెప్పుకున్నారు. తాను మానవుడిగా పుట్టినప్పటికీ, దేవుడి దూతగా ప్రకటించుకున్నారు. తనకు మానవ జన్మ నుంచి కాదు, దేవుడి నుంచి శక్తి వచ్చిందన్నారు. ఈ వ్యాఖ్యలపై ప్రధాని ఇప్పుడు నష్ట నివారణ చర్యలకు దిగారు. అందులో భాగంగానే తానూ అందరిలాంటి మనిషినేనని వివరణ ఇచ్చుకున్నారు' అని జైరామ్ రమేశ్ తన సందేశంలో పేర్కొన్నారు. 'నేను భగవంతుడినేమీ కాదు.. మానవ మాత్రుడినే. నేను జీవితంలో దుర్దుద్దేశంతో తప్పులు చేయలేదు. అయితే పొరపాట్లు చేసుండొచ్చు' అని మోదీ ఇటీవల అన్నారు.

### ఈ ఏడాది భారత ఆర్థిక స్థితి

## కొద్దిగా బలహీనం

**ప్రపంచ ఎకానమీ నిలకడగా పెరుగుదల**

ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అంచనా

వాషింగ్టన్, జనవరి 11: ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక పరిస్థితి నిలకడగా పెరగనున్నప్పటికీ భారతదేశ ఆర్థిక స్థితి మాత్రం స్వల్పంగా బలహీనపడే అవకాశం ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జీవా అభిప్రాయపడ్డారు. ప్రధానంగా అమెరికా వాణిజ్య విధానం ఆధారంగా ప్రపంచంలో ఈ ఏడాది అనిశ్చితి ఏర్పడే అవకాశం చాలా ఉన్నట్టు ఆమె చెప్పారు. శుక్రవారం జరిగిన వార్షిక మీడియా రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2025లో ప్రపంచ పురోగతి నిలకడగా ఉండవచ్చని, అయితే ప్రాంతీయంగా మార్పులు ఉండే అవకాశం ఉందని తెలిపారు. 2025లో భారతదేశ ఆర్థిక పరిస్థితి కొద్దిగా బలహీనంగా ఉండే అవకాశం ఉందని ఆమె అంచనా వేశారు. అయితే దీనిపై ఆమె వివరణ ఇవ్వలేదు. గతంలో తాము ఊహించినదాని కన్నా అమెరికా మెరుగ్గా ఉందని, యూరోపియన్ యూనియన్ స్తంభించిపోయిందని, భారత్ కొద్దిగా బలహీనంగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు. అన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ తక్కువ ఆదాయం గల దేశాలకు కొత్త సవాలు ఎదురైతే దాని ప్రభావం ప్రతికూలంగా ఉండగలదని అభిప్రాయపడ్డారు.

## 8 నెలలుగా ఫ్రిజ్‌లో మహిళ శవం!

**పెండ్లి చేసుకొమ్మన్నందుకు హత్య**

భోపాల్: పెండ్లి చేసుకొమ్మని ఒత్తిడి చేసినందుకు సహజీవనం చేస్తున్న మహిళను ఓ వ్యక్తి హత్య చేసి శవాన్ని రిఫ్రిజిరేటర్‌లో దాచిన దారుణం మధ్యప్రదేశ్‌లోని దేవస్‌లో వెలుగు చూసింది. ఎనిమిది నెలలుగా ఫ్రిజ్‌లో దాచి ఉంచడంతో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఆ మహిళ మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పింకీ ప్రజాపతి(30) అనే మహిళదిగా పోలీసులు గుర్తించారు. ఆమెను సంజయ్ పాటిదార్ అనే వ్యక్తి గత ఏడాది జూన్‌లో హత్య చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఉజ్జయిన్ నివాసి అయిన పాటిదార్‌కు మరో మహిళతో వివాహమైందని, గత ఐదేళ్లుగా అతడు పింకీ ప్రజాపతితో సహజీవనం చేస్తున్నాడని వారు తెలిపారు. పెండ్లి చేసుకోవాలంటూ పింకీ నుంచి ఒత్తిడి పెరిగిపోవడంతో తన స్నేహితుని సాయంతో పాటిదార్ ఆమెను హత్య చేసినట్టు పోలీసులు చెప్పారు. ఇంట్లో నుంచి దుర్వాసన రావటంతో పొరుగున ఉన్నవారు ఆ ఇంటి యజమానిని పిలిపించారు. అతడి ద్వారా హత్య విషయం వెలుగు చూసింది.

## పదవీకాలం పొడిగింపు సరికాదు

- దేశంలో పేపర్ లీకేజీలు వ్యాపారమైంది
- ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ వ్యాఖ్య



బెంగళూరు, జనవరి 11: ఏ పదవికైనా సర్వీసు పొడిగింపు సరికాదని, వరుసలో తర్వాత ఉన్న వారికి ఇది ఎదురు దెబ్బనేనని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులో శనివారం ప్రారంభమైన రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల 25వ జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. పదవీకాలాన్ని పొడిగించడం అంటే కొందరు వ్యక్తులు తప్ప మరొకరు ఆ పదవిని చేపట్టలేరని చెప్పడమేనని, ఇది ఒక కల్పన మాత్రమేనని అన్నారు. దేశంలో ప్రతిభ పుష్కలంగా ఉందని పేర్కొన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లలో నియామకాలు ప్రాపకం, పక్షపాతంతో జరగవద్దని ఆయన అన్నారు. నిర్దిష్ట భావజాలం లేదా వ్యక్తులతో సంబంధం ఉన్నవారు కమిషన్ చైర్మన్, సభ్యులుగా ఉండొద్దని, ఇలా ఉండటం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీయడమేనని పేర్కొన్నారు. దేశంలో పేపర్ లీకేజీ అనేది పరిశ్రమగా, వ్యాపారంగా మారిందని.. ఈ ప్రమాదాన్ని అరికట్టాలని ఆయన సూచించారు

## అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్

**నాకు ఎవరి మద్దతు అవసరం లేదు: డీకే**

చిక్కమగళూరు(కర్ణాటక): ఐదేళ్లపాటు అధికారంలో ఉండేలా రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని దీవించారని, పార్టీ అధిష్ఠానం ఆదేశాల ప్రకారం తాను, సీఎం సిద్ధరామయ్య నడుచుకుంటామని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ శనివారం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో అధికారం కోసం కుమ్ములాటలు జరుగుతున్నాయంటూ వస్తున్న వార్తలను తోసిపుచ్చడానికి ఆయన ప్రయత్నించారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న డీకే శివకుమార్ రాక సందర్భంగా ఇక్కడ పార్టీ కార్యకర్తలు కాబోయే ముఖ్యమంత్రి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తనకు ఎవరి మద్దతు అవసరం లేదని, పార్టీ నాయకత్వం ఆదేశాలకు కట్టుబడి ఉంటానని విలేకరులతో మాట్లాడుతూ ఆయన స్పష్టం చేశారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికార పార్టీ రాజకీయాల్లో మార్పు జరిగే ప్రసక్తి లేదని ఆయన తెలిపారు. సీఎం పోస్టు మార్పిడిపై బయట జరుగుతున్న ప్రచారానికి విలువ లేదని ఆయన వ్యాఖ్యానించారు.



## నిజమే..హిందీ జాతీయ భాష కాదు

**అశ్విన్‌కు బాసటగా అన్నామలై**

చెన్నై: హిందీ భాష గురించి ఇటీవల కీలక వ్యాఖ్యలు చేసిన మాజీ క్రికెటర్ అశ్విన్‌కు తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె.అన్నామలై బాసటగా నిలిచారు. హిందీ జాతీయ భాష కాదని, తాను కూడా అదే చెబుతున్నానని ఆయన స్పష్టం చేశారు. శనివారం అన్నామలై ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. 'నిజమే, హిందీ జాతీయ భాష కాదు. నేను కూడా మీతో ఇదే చెబుతున్నా. అది ఎప్పటికీ మనందర్నీ (దేశ ప్రజలు) కలిపే భాష మాత్రమే. హిందీ సౌకర్యవంతమైన భాష' అని పేర్కొన్నారు. గతంలోనూ ఆయన ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. హిందీని తమిళనాడులో బలవంతంగా రుద్దడాన్ని తమ పార్టీ సహించబోదని 2022లో పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడుతూ.. హిందీ జాతీయ భాష కాదు, అది అధికారిక భాష మాత్రమేనని అశ్విన్ చెప్పిన విషయం విదితమే.

### దళిత అథ్లెట్‌పై

## 60 మంది లైంగిక దాడి

- 15 మంది నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు.. కేసులు నమోదు
- కేరళలో ఐదేండ్లుగా కొనసాగిన ఘోరం..ఆలస్యంగా వెలుగులోకి

పథనంతిట్ట: కేరళలో దారుణం చోటు చేసుకుంది. రాష్ట్రానికి చెందిన దళిత క్రీడాకారిణి(18)పై మొత్తం 60 మంది లైంగిక దాడి చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో శుక్రవారం రాత్రి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటి వరకు ఇందుకు సంబంధించిన కేసుల్లో అరెస్టయినవారి సంఖ్య 15కు చేరింది. పథనంతిట్ట జిల్లాలోని రెండు పోలీస్ స్టేషన్లలో నమోదైన 5 ఎఫ్ఐఆర్‌లపై దర్యాప్తులో భాగంగా శుక్రవారం ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు 16 సంవత్సరాల వయసులో ఉన్నప్పటి నుంచి ఆమెపై అనేక మంది లైంగిక దాడికి పాల్పడినట్లు కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఈ దారుణానికి పాల్పడినవారిలో ఆమె కోచ్‌లు, సహ క్రీడాకారులు, క్లాస్‌మేట్స్ ఉన్నారన్నారు. బాధితురాలి వాంగ్మూలం ప్రకారం, ఆమె తన తండ్రి ఫోన్‌ను ఉపయోగించేవారు. ఆ ఫోన్‌ను, ఆమె రాసిన డైరీలను పరిశీలించి సుమారు 40 మంది అనుమానితులను పోలీసులు గుర్తించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, బాధితురాలికి 13 సంవత్సరాల వయసు ఉన్నప్పటి నుంచి ఈ విధంగా అన్యాయానికి గురవుతున్నదని చెప్పారు.

## ఎల్‌వోసీ వెంబడి పాక్ కుట్రలు

**భారత ఆర్మీ లక్ష్యంగా మందుపాతరలు**

న్యూఢిల్లీ: నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంబడి భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ సరికొత్త వ్యూహాన్ని అమలుజేస్తున్నదని మనదేశ నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఎల్‌వోసీ వెంబడి ఇటీవలి కాలంలో జరుగుతున్న ఉగ్రదాడులే ఇందుకు నిదర్శనమని భారత భద్రతా అధికారులు చెబుతున్నారు. ఎల్‌వోసీ వెంబడి పాక్‌కు చెందిన స్పెషల్ సర్వీస్ గ్రూప్ కమాండోల కదలికలు పెరిగాయని, మనదేశ సైనికుల్ని టార్గెట్ చేస్తూ..మందుపాతర్లను పాతిపెట్టడం, స్థానిక ఉగ్రవాదుల్ని తిరిగి బలోపేతం చేయటం..వంటి చర్యలకు పాక్ పాల్పడుతున్నదని నిఘా వర్గాలు తెలిపాయి. మనదేశ భద్రతా దళాల్ని దెబ్బతీసేందుకు మందుపాతర్లని అమర్చడానికి పాక్ కొత్త ప్రయత్నాలు చేస్తున్నదని, కశ్మీర్ లోయలో ఉగ్రవాదులను తిరిగి క్రియాశీలం చేయాలన్నది పాక్ వ్యూహంగా ఉందని భద్రతా అధికారి ఒకరు మీడియాకు తెలిపారు.

## హిందువులపై దాడులు రాజకీయపరమైనవే!

**బంగ్లాదేశ్ ప్రభుత్వం**

ఢాకా: నిరుడు తమ దేశంలో హిందూ, బౌద్ధ, క్రైస్తవ మైనారిటీలపై జరిగిన దాడులు చాలావరకు రాజకీయ పరమైనవేనని బంగ్లాదేశ్ ప్రభుత్వం శనివారం ప్రకటించింది. కొన్ని మాత్రం మత పరమైనవని అంగీకరించింది. ఈ దాడులపై నమోదైన కేసుల్లో 35 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపింది. తమపై గత ఏడాదిలో 2,010 మతపరమైన దాడులు జరిగాయని బంగ్లాదేశ్‌లోని హిందూ, బుద్దిస్ట్, క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ ఇటీవల ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఫిర్యాదుల కోసం పోలీసులు వాట్సాప్ నంబరును అందుబాటులోకి తెచ్చారని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం తెలిపింది.

## 'ముస్లిం పురుషుడు ఫ్యామిలీ కోర్టులో విడాకులు కోరవచ్చు'

గ్వాలియర్: ముస్లిం పర్సనల్ లాలో చట్టపరమైన నిబంధన లేనంత మాత్రాన ముస్లిం పురుషుడికి న్యాయం లభించే అవకాశం లేదని కాదని మధ్యప్రదేశ్ హైకోర్టు గ్వాలియర్ బెంచ్ స్పష్టం చేసింది. ముస్లిం మ్యారేజెస్ యాక్ట్, 1939 రద్దు కావడంతో పురుషుడు నేరుగా విడాకులు కోరే అవకాశం లేనందున విడాకులు పొందేందుకు ఆ వ్యక్తి ఫ్యామిలీ కోర్టు యాక్ట్, 1984లోని సెక్షన్ 7 కింద ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించవచ్చని హైకోర్టు తెలిపింది. విడాకుల డిక్రీని కోరే హక్కు లేదంటూ ఓ ముస్లిం పురుషుడి పిటిషన్‌ను తోసిపుచ్చుతూ ఫ్యామిలీ కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని పక్కన పెట్టిన హైకోర్టు తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ఆ ఫ్యామిలీ కోర్టును ఆదేశించింది.

# పని గంటలు పెంచినంతనే ఫలితాలు రావు

- రాశి కన్నా వాసి ముఖ్యమన్న ప్రముఖ పారిశ్రామిక వేత్తలు
- కఠోర శ్రమ ఎవరికి వారు ఎంపిక చేసుకోవాల్సిన విషయం
- వ్యక్తిగత-వృత్తిగత జీవిత సమతుల్యత అవసరమని వెల్లడి
- పని గంటల సంఖ్యపై దేశవ్యాప్తంగా మొదలైన విస్తృత చర్చ

న్యూఢిల్లీ: వారంలో ఎక్కువ గంటలు పని చేస్తేనే దేశం ప్రగతి సాధిస్తుందని 'ఇన్ఫోసిస్' నారాయణ మూర్తి, ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ పిలుపునిచ్చిన నేపథ్యంలో పని గంటల సంఖ్యపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా, జోహో సీఈవో శ్రీధర్, ఆరిన్ క్యాపిటల్ చైర్మన్ మోహన్ దాస్ పాయ్, ఎడెల్‌వీస్ సీఈఓ రాధిక గుప్తా తదితరులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాశి కన్నా వాసి ముఖ్యమని ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. ఎడెల్‌వీస్ సీఈఓ రాధిక గుప్తా తన వృత్తిగత జీవిత విశేషాలను లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో వివరించారు. కఠోర శ్రమ అనేది ఎవరికి వారు ఎంపిక చేసుకోవాల్సిన అంశమని తెలిపారు. తన కెరీర్ ప్రారంభంలో వరుసగా నాలుగు నెలల పాటు వారానికి 100 గంటలు పని చేసినట్టు తెలిపారు. అయితే ఇలా పని చేసినపుడు అత్యధిక భాగం సమర్థంగా పని చేయలేకపోయానని, మానసికంగా భారంగా ఉండేదని, దవాఖానకు వెళ్లాల్సి వచ్చేదని చెప్పారు. కఠోర శ్రమ ముఖ్యమేనని, అదే సర్వస్వం కాదని స్పష్టం చేశారు. కార్పొరేట్ నిచ్చెనలో అగ్ర స్థానానికి ఎగబాకాలని అందరూ కోరుకోరన్నారు. సీఈఓ అయిపోవాలని ప్రతి ఒక్కరికీ ఉండదన్నారు. చురుగ్గా, తెలివిగా, సూక్ష్మబుద్ధితో పని చేయాలని, సుదీర్ఘ సమయం పని చేయడం కాదని చెప్పారు. చాలా అభివృద్ధి చెందిన దేశాల్లో 8-4 గంటలు పని చేస్తారని, అయినప్పటికీ, ఆ సమయాన్ని సమర్థంగా, సత్ఫలితాలు వచ్చేలా వినియోగించుకుంటారని తెలిపారు.

తానూ రాశి కన్నా వాసికే ప్రాధాన్యం ఇస్తానని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్ర చెప్పారు. పని శ్రేష్ఠత మీద దృష్టి పెట్టాలని, పని పరిమాణంపైన కాదని వివరించారు. షార్క్ ట్యాంక్ ఇండియా జడ్జి, ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నమిత థాపర్ స్పందిస్తూ తమ వ్యాపార వృద్ధి కోసం వ్యవస్థాపకులు ఎక్కువ సేపు పని చేయవచ్చునని, అదే విధంగా ఉద్యోగులు కూడా పని చేయాలని ఆశించకూడదని చెప్పారు. వారానికి 10 గంటలు నేర్చుకోవడానికి కేటాయించాలని క్యూర్‌ఫిట్ వ్యవస్థాపకుడు ముకేశ్ బన్సల్ అభిప్రాయపడ్డారు. స్విగ్గీ ఫుడ్ అండ్ మార్కెట్‌ప్లేస్ సీఈఓ రోహిత్ కపూర్ స్పందిస్తూ..పని చేయాలని, అయితే వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేయాల్సిన అవసరం లేదని వివరించారు.

ఆర్థికాభివృద్ధి కోసం అటువంటి కఠోర శ్రమ అవసరమా అని జోహో సీఈఓ శ్రీధర్ వెంబు ప్రశ్నించారు. ఎక్కువ మంది ప్రజలు వృద్ధాప్యంలో ఒంటరి జీవితాలను అనుభవిస్తే, ఆ అభివృద్ధికి విలువ ఏముంటుందని ప్రశ్నించారు. ఆరిన్ క్యాపిటల్ చైర్మన్ మోహన్‌దాస్ పాయ్ మాట్లాడుతూ.. కంపెనీలు ఉద్యోగులపై పని గంటలను రుద్ద కూడదన్నారు.



### గుర్తింపు లేక.. ఒత్తిడి భరించలేక రాజీనామా

ఉద్యోగులు వారానికి 70 గంటలు పని చేయాలని చర్చ జరుగుతున్న వేళ భుపేంద్ర విశ్వకర్మ అనే ఓ ఇన్ఫోసిస్ మాజీ ఉద్యోగి లింక్డ్‌ఇన్‌లో చేసిన పోస్ట్ చర్చనీయాంశమైంది. ఇన్ఫోసిస్‌లో తనకు పదోన్నతి వచ్చినా మూడేండ్లు జీతం పెంచలేదని అతడు ఆరోపించారు. 50 మంది చేయాల్సిన పని భారాన్ని ఆ 30 మందిపై వేశారని చెప్పారు. ఎంత పని చేసినా గుర్తింపు ఉండేది కాదని చెప్పారు. ఆన్‌సైట్ అవకాశాలు ఎక్కువగా తెలుగు, తమిళం, మలయాళం మాట్లాడేవారికే దక్కేవని, హిందీ మాట్లాడే వారి పనితీరు బాగున్నా అవకాశాలు వచ్చేవి కాదని ఆరోపించారు. ఇవన్నీ భరించలేక, తన ఆత్మగౌరవం, మానసిక ఆరోగ్యం విషయంలో రాజీ పడలేక ఉద్యోగాన్ని వదిలేసినట్టు చెప్పారు.

## కాఫీ.. రోజులో ఒక్కసారే ఉత్తమం!

**మరణ ముప్పు తగ్గుదలకు తోడ్పాటు**

న్యూఢిల్లీ: కాఫీని పరిమితంగా సేవించడం ఆరోగ్యానికి ప్రయోజనకరమేనని గతంలో చాలా అధ్యయనాల్లో తేలింది. కానీ, మరింత ఉత్తమ ఫలితాలను పొందాలంటే ఏ సమయంలో కాఫీని తాగాలో శాస్త్రవేత్తలు తేల్చారు. రోజంతా ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా ఒక్కసారి మాత్రమే కాఫీని సేవించాలని, అది కూడా ఉదయం వేళలో మితంగా సేవిస్తే ఆరోగ్యానికి మరింత ప్రయోజనం చేకూరడంతోపాటు మరణ ముప్పు తగ్గుతుందని వెల్లడించారు. అమెరికాలోని టులేన్ యూనివర్సిటీ నిపుణుల సారథ్యంలోని పరిశోధకుల బృందం ఈ అధ్యయనాన్ని నిర్వహించింది. 40 వేల మందిని దాదాపు దశాబ్దం పాటు నిశితంగా పరిశీలించి అధ్యయన ఫలితాలను వెల్లడించారు. కాఫీ తాగే అలవాటే లేనివారితో పోలిస్తే ఉదయం వేళలో కాఫీ సేవించే వారికి మరణ ముప్పు 16% తక్కువగా ఉంటుందని, గుండె జబ్బులతో మరణించే అవకాశాలు 31% తక్కువగా ఉంటాయని సైంటిస్టులు ప్రకటించారు.